క్లుప్తంగా

వీధిదీపాలకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

లావేరు: అదపాక గ్రామంలో పాడైన వీధి దీపాలకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ గొర్లె శశికళ, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బందితో వీధి దీపాలను బాగుచేయించారు.

శివగౌరీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి డాక్టరేట్ అందుకుంటున్న శివగౌరీప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన సువ్వారి శివగౌరీప్రసాద్ ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ పి.వి.వి.సత్యనారాయణ గైడ్‌గా సిద్ధాంత వ్యాసం అనే అంశంపై డాక్టరేట్ చేశారు. ప్రస్తుతం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో రాజాంలోని జీఎంఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బలగ శాఖా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అన్నారు. బలగశాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం–మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పొందవచ్చునన్నారు. ప్రతి విద్యార్థి తనకు అందుబాటులో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకి కథలు చెప్పి వారి చేత కథలు చదివించడం, తెలుగు పుస్తకాలు చదివించి వారి తప్పులు సరిదిద్ది బాగా చదివిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామికి పుస్తకార్చన



రంగనాథ తరుణం పుస్తకాల సమర్పణ

శ్రీకాకుళం కల్చరల్: మహబూబ్‌నగర్ జిల్లాలోని శ్రీరంగాపురంలో ఉన్న ప్రాచీన క్షేత్రమైన రంగనాథ స్వామికి తాను రచించిన 'గంగనాథ తరణం' పుస్తకాలతో అర్చనలు చేసినట్లు నగరానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కాశిన వేంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 పుస్తకాలతో రంగనాథునికి అర్చన చేశామన్నారు. ఈ పుస్తకాలను భక్తులకు అందించాలని ఆలయ అర్చకులు తెలియజేశామన్నారు. ఈ పుస్తకంలో దేశంలోని సుప్రసిద్ధ వైష్ణవ ఆలయాలు, గృహాలయాలు, పంచ రంగ క్షేత్రాల విశేషాలు, ఆరాధనా స్తోత్రాలతో శ్రీరంగ మహత్యం, రంగనాథ శతకం పొందుపర్చినట్లు తెలిపారు.

చింతాడ గణపతిస్వామికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న చింతాడ గణపతిస్వామి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్టాటిస్టిక్స్ విభాగంలో 'క్యూయింగ్ మోడల్ విత్ డూన్ రిక్రూట్మెంట్ ప్రాసెస్' అనే అంశంపై ఉత్తమ పరిశోధనందుకు డాక్టర్ చింతాడ గణపతిస్వామికి విశాఖపట్నంలో జరిగిన కన్వొకేషన్–2023లో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా గౌల్డ్‌మెడల్‌ను అందించారు. విశాఖపట్నంలో శనివారం రాత్రివరకు జరిగిన ఈ కార్యక్రమంలో గోల్డ్‌మెడల్‌ను అందించారు. కొత్తూరు మండలంలోని గులివిందలపేట గ్రామానికి చెందిన సాధారణ వ్యవసాయ ఆధారిత కుటుంబానికి చెందిన చింతాడ రంగయ్యస్వామి, పద్మావతి కుమారుడు గణపతిస్వామి. ఈయన శ్రీకాకుళం నగరంలో నివాసముంటున్నాడు. 87 నుంచి 90వ కంబైన్డ్ కన్వొకేసన్–2023 నిర్వహించారు. గౌల్డ్‌మెడల్ సాధించినందుకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణగారు, జి.ఎం.ఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసాద్‌రెడ్డి, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం సబబేనని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి ఘనులైనా శిక్ష తప్పదని.. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కుంభకోణాల చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో న్యాయం గెలిచిందని నిరూపణ అయిందన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన మిగిలిన టీడీపీ నాయకులను కూడా విచారించి శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ఆర్థిక ఉగ్రవాది



చంద్రబాబు ఆర్థిక ఉగ్రవాది. అందుకే కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. నిప్పుగా చెప్పుకునే ఆయన అవినీతి బాగోతం ఇప్పటికి బట్టబయలైంది. న్యాయం దృష్టిలో అందరూ సమానమే.

–ఉకలాపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెదలింగాలవలస, లావేరు మండలం

ప్రజాధనం దుర్వినియోగం చేస్తే శిక్ష తప్పదు



అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు అవినీతి చేసి నాకెవ్వరు ఏమిచేయలేరనే మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. ఎట్టకేలకు అక్రమాలన్నీ రుజువుకావడంతో బాబుని జైలుకు పంపించారు. రాష్ట్ర ప్రజలంతా అవినీతిలేని పాలనను కోరుకుంటున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను సామాన్య ప్రజలు సైతం స్వాగతిస్తున్నారు. అవినీతి చేసినవారు ఎంతటి వారికైనా శిక్షతప్పదు.

– మామిడి శ్రీకాంత్, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్, శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

చట్టం ముందు అందరూ సమానమే



చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి దోచుకోవడం, దాచుకోవడం అలవాటైపోయింది. అవినీతి అంతా బట్టబయలు కావడంతో జైలుకి పంపించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పుచేసేవారికి శిక్షతప్పదన్న విషయం సామాన్యుడికి సైతం తెలిసింది. బాబుకి జైలుకి పంపించడం పట్ల ఎక్కడా ఒక్క సామాన్యుడు కూడా రోడ్డుపైకి వచ్చేపరిస్థితి లేదు.

– ఎం.వి పద్మావతి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నిజాలు బయటకు తెలిశాయి..



చంద్రబాబు నాయుడు స్కిల్ కుంభకోణంలో పాత్ర ఉండటం వల్లే ఆయనను సీఐడీ అరెస్టు చేసింది. ఆ విషయాన్ని న్యాయస్థానం సబబే అని చెబుతూనే రిమాండ్ విధించడంతో న్యాయమే గెలిచింది. వ్యవస్థలను మేనేజ్ చేయటంలో చంద్రబాబు దిట్ట. ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందన్న నమ్మకం కలిగింది. ఈ కుంభకోణంలో ఉన్న ప్రతీ ఒక్కరిని అరెస్టు చేసి నిజాలు బయటకు తెలియాలి.

– గొండు రఘురామ్, రాష్ట్ర అగ్రిమిషన్ మెంబర్, గార

న్యాయవ్యవస్థలపై నమ్మకం కలిగింది



40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసులో చంద్రబాబుకి 14 రోజుల రిమాండ్ విధించడం సమంజసమే. చంద్రబాబుని అరెస్ట్ చేయడంతో సామాన్యులకు సైతం న్యాయవ్యవస్థలపై నమ్మకం కలిగింది. తప్పు చేస్తే ఎవ్వరికైనా శిక్ష పడుతుందన్న విషయం అందరికీ తెలిసింది.

– మండవిల్లి రవి, వైఎస్సార్‌సీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి, శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పేదలకు అండగా లయన్స్ క్లబ్



కుట్టుమిషన్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: పేదలకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి శ్రీకాకుళంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన జిల్లా గవర్నర్స్ డే లాంగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. జిల్లా గవర్నర్ ఈ కార్యక్రమానికి హాజరై క్లబ్ కార్యకలాపాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓ నిరుపేద కుటుంబానికి ఒక నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. మరో నిరుపేద మహిళలకు పోషణ నిమిత్తం కుట్టు మిషన్‌ను అందజేశారు. అలాగే వృద్ధులకు ఆసరాగా ఉపయోగపడేందుకు ఖ్యాతి ఫౌండేషన్‌కు ఓ స్ట్రక్చర్‌ను అందజేసింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రొఫెసర్ ఎస్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్, రెండో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.సూర్య ప్రకాష్, క్లబ్ జిల్లా కేబినెట్ కార్యదర్శి డాక్టర్ విప్పల ప్రసాద్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి పడమట కాళిదాస్, రీజియన్ చైర్మన్ తూముల శ్రీనివాసరావు, జోన్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, కార్యదర్శి టిక్కం రామ్‌గోపాల్, కోశాధికారి శిల్లా మణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఉన్నతాధికారులు



డీఆర్వో గణపతిరావుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శ్రావణ ఆదివారం సందర్భంగా పలువురు జిల్లా స్థాయి అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.గణపతిరావు తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అలాగే విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

పట్టుసాగుతో అధిక లాభాలు



మల్బరితోటను పరిశీలిస్తున్న ఏడీ అరుణకుమారి

రణస్థలం: వైఎస్సార్ పట్టుబడి పథకంతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని పట్టుపరిశ్రమ శాఖ గుంటూరు ఎడిషనల్ డైరెక్టర్ సి.అరుణకుమారి అన్నారు. క్రిష్టాపురం పంచాయతీ గోసాం గ్రామంలో వైఎస్సార్ పట్టుబడిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దువ్వు తాతిరెడ్డి, కాలపురెడ్డి రైతులకు చెందిన పట్టుబడి షెడ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి టి.ప్రసాద్, మండల అధికారిణి సి.హెచ్.కె.రత్న, గ్రామ సర్పంచ్ కంబపు రామిరెడ్డి ఉన్నారు.


వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



కనకరాజును పరామర్శిస్తున్న నాయకులు

లావేరు: గుమడాం సచివాలయం కన్వీనర్ నాగం కనకరాజు ఇటీవల గాయపడ్డారు. విషయం తెలియడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం గుమడాం వెళ్లి కనకరాజును పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శ చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ ఉుకలాపు అప్పలనాయుడు, మండల మాజీ అధ్యక్షుడు వట్టి సత్యన్నారాయణ, గోవిందపురం పంచాయతీ మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, నాయకులు ఎందవ శ్రీనివాసరావు, పతివాడు గురునాయుడు, తరిగొప్పుల శ్రీనివాసరావు ఉన్నారు.

అయోధ్య రామాలయ ప్రతిష్ట విజయోత్సవాలు



మాట్లాడుతున్న శ్రీనివాసాచార్యులు

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్యలోని సీతారామాలయ ప్రతిష్ట ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాకుళంలో విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు విశాఖకు చెందిన శేషాచార్యులు, నారాయణ తిరుమల ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నారాయణ తిరుమల కల్యాణ మండపంలో విజయోత్సవాలు నిర్వహించుటకు ప్రణాళిక కోసం కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులందరి భాగస్వామ్యంతో సీతామచంద్ర విజయోత్సవాలు 2 వేల మంది దంపతులతో శ్రీకాకుళం పట్టణంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద గల ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నవంబరు 9న నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని సీతారామ చంద్రుల కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వెంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధనకు అవార్డు



ఎండోమెంట్ ప్రైజ్ అందుకుంటున్న డాక్టర్ స్వాతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరానికి చెందిన, శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నాగేశ్వర స్వాతికి ఆంధ్ర యూనివర్సిటీ 2019 ఉత్తమ పరిశోధనకు అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో వైస్ చాన్స్‌లర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి, ప్రొఫెసర్ దేశరాజు వెంకట్రావు శతాబ్ద పూర్తి ఎండోమెంట్ ప్రైజ్ బహూకరించారు. 87, 88, 89, 90 సంయుక్త స్నాతకోత్సవంలో ఈ గుర్తింపు లభించింది. ఫార్మాసిటికల్ సైన్స్ విభాగంలో 2019 సంవత్సరానికి గాను ఈ అవార్డును డాక్టర్ స్వాతికి ప్రకటించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఫార్మాసిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధన విద్యార్థిగా, ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్ మార్గదర్శకత్వంలో ఐదేళ్లు పరిశోధన చేశారు. 'కెమికల్ అండ్ బయోలాజికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సెర్రాటియోపెప్టిడేస్ నోవెల్ సోర్సెస్' అనే టైటిల్‌ను సబ్‌మిట్ చేసినందుకు 2019లో డాక్టరేట్ లభించింది. ఆమె పరిశోధించిన వ్యాసాలను అనేక ఇంటర్నేషనల్, నేషనల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. నేషనల్ సెమినార్‌లో ఉత్తమ మౌఖిక ప్రదర్శన కూడా లభించింది.

ఆకట్టుకున్న సంగీత కచేరీ



గాయకుడు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖపట్నానికి చెందిన ప్రాతా కృష్ణమూర్తి సంగీత కచేరీ ఆకట్టుకుంది. బాపూజీ కళా మందిర్‌లో తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సునాద వినోదిని సంగీత సంస్థ వ్యవస్థాపకులు ఎం.కె.ఆర్.ప్రసాద్ 75వ జయంతి ఉత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ తన గురువును జ్ఞాపకార్థం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు మాట్లాడుతూ ప్రసాద్ సంగీతం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ముందుగా సుసరాపు లక్ష్మీ గణపతి శర్మతో వాయులీన కచేరీ సాగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, బాలసుబ్రహ్మణ్యశర్మ, కుమార్ విఘ్నేష్, మావుడూరి సత్యనారాయణ, మావుడూరి సూర్యప్రసాదరావు, సంస్థ వ్యవస్థాపకులు మండా శ్రీనివాసరావు, సోమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువత క్షణికావేశాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి క్షణికావేశాలకు పోకుండా ఉండాలని స్పందన ఇదా ఇంటర్నేషనల్ తరఫున ప్రముఖ రచయిత, సైకాలజిస్ట్ బొడ్డేపల్లి భూపతిరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని చక్రధర్ ఐఐటీ–నీట్ అకాడమీ జూనియర్ కాలేజీలో చైర్మన్ చక్రధర్ అధ్యక్షతన ఆదివారం ఆత్మహత్యల నిరోధక దినోత్సవం నేపథ్యంలో విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. భూపతిరావు మాట్లాడుతై జీవితం, మరీముఖ్యంగా విద్యార్థి జీవితం అద్భుతమైనదని, దానిని బాధ్యతాయుతంగా మలుచుకుని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. పాలు తాగే వయసులో శిశువుకి అన్నం పెడితే శిశువు చనిపోతుందని, చదివే వయస్సులో ఆకర్షణలో పడితే విద్యార్థి జీవితం నాశనం అవుతుందని.. పరిణితితో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంలో తొందరపడి జీవితాలును నాశనం చేసుకోవద్దని, ప్రతి సమస్యకు చావే పరిష్కారం అయితే ఈ లోకంలో ఎవరూ మిగలరని, సమస్యకు కారణాలను అన్వేషించి, సమస్యకు కారణాలను ఎదుర్కోవడమే నిజమైన విద్య అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- లావేరులో సచివాలయం భవనాలు ప్రారంభం



సచివాలయ భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం లావేరు–1 సచివాలయానికి రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాలను ఆదివారం ప్రారంభించారు. అలాగే లావేరు గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఏదైనా చేస్తానని చెప్పారంటే కచ్చితంగా అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో కలిగిందన్నారు. గత పాలకులు వలె కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొనడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, పీఆర్ మండల జేఈ అప్పన్న, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలక్రిష్ణ, జడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొంతు సూర్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, లావేరు పంచాయతీ సర్పంచ్ ఉర్లాపు లక్ష్మీ, లావేరు–1, 2 ఎంపీటీసీ సభ్యులు డోకల రాధ, ఇనపకుర్తి సతీష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు కింతలి రమేష్‌బాబు, ఏఎంసీ డైరెక్టరు లంకలపల్లి నారాయణరావు, పార్టీ మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, లంకలపలి గోపి, లావేరు–1, 2 సచివాలయాల కన్వీనర్లు మహదాసు చక్రధరరావు, పడాల పాపారావు, లంకలపల్లి భాస్కరరావు, తార అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



ఎచ్చెర్ల క్యాంపస్: బహుమతులు సాధించిన విద్యార్థులు



రణస్థలం: గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు . గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, విద్యార్థులకు అందిస్తున్న సేవలపై విద్యార్థులకు గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. కథలు చెప్పటం, నీతి పద్యాలు, ఇతిహాస గ్రంథాలు చదివించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రణస్థలం: పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి సూచించారు. చదవడం–మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయంలో నిర్వహించారు. దినపత్రికలు, కార్టూన్లతో కూడిన మ్యాగజైన్లను పిల్లలతో చదివించారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



నడక పోటీలకు జెండా ఊపుతున్న సత్యం

శ్రీకాకుళం అర్బన్: నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వాకర్స్ గవర్నర్ కె.సత్యం అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సూర్యా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నడక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వ్యాయామం లేకపోవడం, ఆహారపు విషయంలో సమయం పాటించకపోవటం, బయట చిరుతిళ్లు వంటి కారణాల వల్ల చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ పరిస్థితులు గ్రహించి వాటిని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా వాకర్స్ క్లబ్‌లు వెలిశాయని సత్యం అన్నారు. అన్ని వయస్సుల వారు వాకర్స్ క్లబ్స్‌లో చేరి ఆరోగ్యానికి రక్షణ కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యాయామాల్లో నడక అనేది తెలికపాటి వ్యాయామం అని, నడకతో అనేక రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. నడక అనేది దివ్యౌషధం వంటిదని, గుండె పనితీరు క్రమబద్ధం చేయటంలోపాటు ఆరోగ్యం నిలకడగా ఉంచేందుకు దోహదపడుతుందన్నారు. ఉదయం పూట వాకింగ్ చేస్తే రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో ఉన్న వాకర్స్ క్లబ్స్ అన్నీ స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ శ్రీకాకుళం సాధనలో క్రియాశీలక పాత్ర పోసిస్తున్నాయన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కూన వెంకటరమణ మూర్తి, పి.జి.గుప్తా, సూర్యా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బెవర శ్రీరాములు, నలినీ సుధాకర్, సురేశ్ పండా, అన్నెపు సత్యనారాయణ, చలం, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, గోలీ సంతోష్, ఎస్.సంజీవరావు, వై.మోహన్, గోలీ ఉమామహేశ్వరరావు, మారుతీ వాకర్స్ క్లబ్ ప్రతినిధి కొంఖ్యాన మురళి తదితరులు ఉన్నారు.

గొప్ప చిత్రకారుడు వడ్డాది



రత్నచిత్రను ఆవిష్కరిస్తున్న లక్ష్మీ మంగమ్మ

శ్రీకాకుళం కల్చరల్: ఎంతో గొప్ప చిత్రకారుడు వడ్డాది పాపయ్య(వాపా) అని శత జయంతి ఉత్సవకమిటీ అధ్యక్షుడు దివిలి హేమచంద్ర అన్నారు. స్థానిక పెట్రోమాక్స్ వీధిలోని ఆతని ఇంటి వద్ద విశాఖపట్నం చిత్ర కళాపరిషత్ ప్రచురించిన రత్నచిత్రను వపా జయంతి సందర్భంగా వపా సతీమణి లక్ష్మీమంగమ్మ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమచంద్ర మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాటు చందమామ, యువ, అభిసారిక, రేరాణి స్వామి వంటి పత్రికలకు చిత్రాలను వేసి పాఠకలోకాన్ని రంగుల లోకంలో విహరింప జేశారన్నారు. శ్రీకాకుళంలో వాపా నివసించిన ఈ పెట్రోమాక్స్ వీధి పేరును వడ్డాది పాపయ్య వీధిగా మార్చడానికి ప్రయత్నాలు మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో జరుగుతున్నాయని, త్వరలోనే ఇది సాకారం కాబోతోందన్నారు. వాపా సతీమణి లక్ష్మీ మంగమ్మ మాట్లాడుతూ పాపయ్య చిరకాల కోరిక అయిన రత్నచిత్రను ప్రచురించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న వపా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాక త్రివిక్రమ్ దేవ్, చిత్రలేఖన ఉపాధ్యాయులు మెండస మోహన్‌రావు, సీది మాధవ్, చిత్రకారులు శ్రీఆర్ట్స్ శ్రీనివాస్, శ్రీను ఆర్ట్స్ శ్రీనివాస్, రాహుల్ పట్నాయిక్ పాల్గొన్నారు.